ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు కొత్త ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. ఈ మేరకు ఈనెల 8న స్థానిక సుందరయ్య భవనంలో శనివారం మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నాయకులు డ్రైవరమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో రమాదేవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు. చాలీచాలని జీతాలతో బతుకులు నెట్టుకొస్తున్నారన్నారు. ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, వంట షెడ్డులు, ప్రభుత్వం సబ్సిడీ గ్యాస్, మెనూ చార్జీల పెంపు, కాటన్ చీరలు, ఉద్యోగ భద్రత లాంటి సమస్యల పరిష్కారానికి కొత్త ప్రభుత్వం ఎంతో ఆశగా ఎదురుచూస్తుందని అన్నారు. నిత్యవసర వస్తు ధరలు పెరుగుతున్నాయని, వైద్యం ఖర్చు పెరిగిందని, కావున కొత్త ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వై.శాంతి కుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు అనేకమని, వాటంటినీ పరిష్కరించి, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిబంధనలకు పాతర

ర్యాంకుల సునామి.. అత్యుత్తమ ఫలితాల్లో మాదే అగ్రగామి.. రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు మా విద్యార్థులకే సొంతం.. అంటూ అందమైన ప్రకటనలతో విద్యార్థులకు గాలం వేస్తున్న కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలను. జిల్లాలో నిబంధనలకు పాతరేస్తూ ఇష్టారాజ్యంగా విద్యా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం గమనార్హం. విద్యా శాఖ నిబంధనలు పట్టని ఆయా విద్యాసంస్థలు అడ్డుగోలుగా అడ్మిషన్లు దండుతున్నాయి. అట్టపెట్టెల్లాంటి గదుల్లో తరగతులు నిర్వహిస్తూ ఫీజులు మాత్రం ఘోరంగా వసూలు చేస్తున్నాయి.

- ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాల లేమి
- ఆకర్షణీయ ప్రకటనలతో విద్యార్థులకు గాలం
- అడ్డుగోలుగా అడ్మిషన్లు
- అధికారులకు పట్టని వైనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో సుమారుగా 200 ప్రయివేటు జూనియర్ కళాశాలలున్నాయి. 500 వరకు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు లక్షన్నర మంది విద్యార్థులు చదువుతున్నారు. అందులో పలు ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. ఎక్కడా సరైన గదులు, ఆట స్థలాలు లేకుండానే విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. పలు విద్యా సంస్థలు ఆకర్షణీయమైన ప్రకటనలతో ఊదర గొడుతున్నాయి. అత్యధిక మార్కులు తమ సొంతం.. అంటూ ప్రచారం చేసుకుంటున్నాయి. ఈ మాయలో పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నాయి. కార్పొరేట్ సంస్థల్లో కాబోయే ఇంజినీర్లు, డాక్టర్లుగా తల్లిదండ్రులు ఊహించుకునే పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాలలకు అనుమతులున్నాయో?, లేవో చూసుకోవడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేస్తున్నారు. అనుమతులున్న కార్పొరేట్ కళాశాలల మాయమాటలు సైతం నమ్మి మోసపోతున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

అసౌకర్యాల నడుమ

పలు ప్రయివేటు విద్యాసంస్థల్లో ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఫ్యాన్లు, మరుగుదొడ్ల కొరత వేధిస్తోంది. సిబ్బంది కొరత మరీ తీవ్రతరంగా ఉంది. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలు సిబ్బందికి వేతనాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగునీరు కూడా లేని పరిస్థితి కొన్నిటిలో కనిపిస్తోంది. ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్న నీటిపైనే ఆధారపడాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. సెక్షనుకు 80 మంది విద్యార్థులు, కోటా ప్రకారం సీట్ల కేటాయింపు బిల్డింగ్ పర్మిషన్, లీజ్ అగ్రిమెంట్, ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పార్కింగ్ స్థలం, ఫర్నిచర్, కంప్యూటర్ గది, సిబ్బంది ఒరిజినల్ సర్టిఫికెట్లు, నాణ్యతమైన బోధనను అందించే ఆధ్యాపకులు లేని విద్యాసంస్థలు జిల్లాలో కోకొల్లలు. వీటిపై పరిశీలన చేసి, అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతుల్లేని హాస్టళ్లు

జిల్లాలో దాదాపు అన్ని ప్రయివేటు కళాశాలలు అనుమతులు లేకుండానే హాస్టళ్లను నిర్వహిస్తున్నాయి. డిఇఒ, ఇంటర్ బోర్డు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే విద్యాసంస్థల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేకుండానే..

జిల్లా కొన్ని విద్యాసంస్థలకు అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలలు బ్రాంచుల పేరుతో ఒకటి రెండు విద్యాసంస్థలకు అనుమతులు తీసుకుని, 4, 5 చోట్ల అడ్మిషన్లు స్వీకరిస్తున్నారు. ఇటువంటి విద్యాసంస్థలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యాసంస్థలకు గుర్తింపు లేకపోతే విద్యార్థులు నష్టపోయే అవకాశాలున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతులు ఉంటే ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలు సక్రమంగా అందే అవకాశం ఉంటుంది. గుర్తింపు లేని విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థులకు ఉపకార వేతనాలు రాక, సర్టిఫికెట్లు అందక ఉన్నత విద్యలో చేరేందుకు అడ్డంకులు ఏర్పడతాయి. ఇలా అనేక సమస్యలు వస్తాయి.

ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు వ్యాపారమే పరమావధిగా నిబంధనలకు నీళ్లొదిలేలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలకు ఉపక్రమించకుండా చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

పర్సా ఆశయ సాధనకు కృషి

శత జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సమరశీల కార్మికోద్యమాన్ని కాపాడడంలోనూ, రాష్ట్రంలో సిఐటియు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన పర్సా సత్యనారాయణ ఆశయాలను కార్మికవర్గం ముందుకు తీసుకుపోవడమే ఆయనకు మనం ఇచ్చే ఘన నివాళి అని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. స్థానిక స్థానిక సుందరయ్య భవనంలో పర్సా సత్యనారాయణ శతజయంతోత్సవాలు సందర్భంగా ఆయన చిత్రపటానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, కోశాధికారి గొర్లె వెంకటరమణ, మధ్యాహ్నం భోజనం పథకం సంఘం జిల్లా కార్యదర్శి వై,శాంతి కుమారి, సిఐటి నాయకులు గవర వెంకటరమణ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మన్మథరావు మాట్లాడుతూ పర్సా జీవిత ఆరంభం ఉద్యమ కెరటాల్లో ఆవిర్భవించిందన్నారు. సింగరేణిలో అగ్నిజ్వాల రగిలించింది, నైజాం రజాకార్లను ఎదిరించి తీవ్ర నిర్బంధానికి గురయ్యారని పేర్కొన్నారు.

డెత్ వారెంట్‌తో కాల్చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, కానీ ఔరంగాబాద్ జైలుకు తరలించి, చీకటి గదిలో బంధించారన్నారు. జైలు బాత్రూం గోడకు కన్నం పెట్టి తప్పించుకుని, అనేక కష్టాలతో ప్రయాణించి వరంగల్ దళాల్లో తిరిగి చేరారన్నారు. పర్సా జీవితంలో సుమారు 9ఏళ్లకు పైగా జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు.

1966లో ఎమ్మెల్యే పదవికి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం సందర్భంగా రాజీనామా చేశారన్నారు. 1970 సిఐటియు ఆవిర్భావం నుంచి 2002 వరకు రాష్ట్ర అధ్యక్షులుగా, అఖిలభారత ఉపాధ్యక్షులుగా పని చేశారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ట్రేడ్ యూనియన్ ఉద్యమం ఎర్రబావుటా కింద రెపరెపలాడడానికి బీజాలు నాటారని, వర్గ పోరాట సిద్ధాంతాన్ని అమలు చేయడానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. పర్సా జీవితం వ్యక్తిగతంగా అత్యంత నిరాడంబరం, ఎమ్మెల్యేగా పనిచేసిన, ఉన్నత స్థాయిలో ఉన్న, ఒక్క సెంటు భూమి గానీ, చిన్న ఇల్లు గాని సంపాదించుకోలేదని, ఎమ్మెల్యే అలవెన్స్ చనిపోయే వరకు పార్టీకి జమ చేశారని, కార్మిక నేతలు అనుసరించాల్సిన నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం గా నిలిచారని కొనియాడారు.

చైతన్యను సన్మానిస్తున్న విసి ప్రశాంత కుమార్, రిజిస్ట్రార్ పల్లవి

సెంచూరియన్ విద్యార్థికి రూ.50 లక్షల ప్యాకేజీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో బిటెక్ పూర్తిచేసిన కుసుమంచి చైతన్య రూ.50 లక్షల వేతన ప్యాకేజీకి ఎంపికయ్యాడు. నెదర్లాండ్స్‌కు చెందిన ఫ్లాంక్ నెట్ వర్క్ సంస్థలో ఆయనకు అవకాశం లభించింది. చైతన్యది సాధారణ కుటుంబం. ఫ్లిప్‌కార్ట్‌లో రూ.32 లక్షల ప్యాకేజీకి కూడా చైతన్య ఎంపికయ్యాడు. శనివారం చైతన్యను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విసి మహంతి మాట్లాడుతూ కష్టపడి చదివిన వారికి మంచి ఫలాలు అందుతాయనడానికి చైతన్య నిదర్శనమన్నారు. పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను పెంచుకోవడానికి సెంచూరియన్ ఒక మంచి వేదిక రిజిస్ట్రార్ పల్లవి తెలిపారు. ఐఐటి చదివిన విద్యార్థుల కంటే మెరుగ్గా తాను పోటీ ఇవ్వగలిగానని చైతన్య తెలిపాడు. డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డాక్టర్ లక్ష్మణరావు తనను ఎంతగానో ప్రోత్సహించారని గుర్తుచేసుకున్నాడు.

గుంకలాంలో..
ముందుకు సాగని ఇళ్లు

- పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో వెనుకడుగు
- మౌలిక సౌకర్యాలు కరువు
- కొత్త ప్రభుత్వమైనా పూర్తి చేస్తుందా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారుల అష్టకష్టాలు పడుతున్నారు. నిర్మాణ వ్యయం పెరగడం, కాలనీల్లో సరైన సౌకర్యాల లేమితో ఇళ్ల నిర్మాణాలు ముందుకు కదలడం లేదు. విజయనగరానికి చెందిన గుంకలాం లేఅవుట్‌లో ఇళ్లు మంజూరై మూడేళ్లు దాటినా నేటికీ నిర్మాణాలు పూర్తి కాలేదు. గుంకలం లేఅవుట్‌లో తొలి విడతలో సుమారు 13 వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇస్తోంది. ఈ మొత్తంలో ఒక్కొక్క సిమెంట్ బస్తా రూ.267 చొప్పున రూ.24 వేలు విలువ చేసే 90 సిమెంట్ కట్టలు, రూ. 35 వేలు ఖరీదు చేసే 495 కిలోల స్టీల్ అందిస్తారు. మిగిలిన మొత్తం నాలుగు విడతల్లో నిర్మాణ దశలను బట్టి గృహ నిర్మాణ శాఖ అధికారులు మంజూరు చేస్తున్నారు. ఇక్కడ మాత్రం సిమెంట్, ఇసుక తప్ప ఐరెన్ ఇవ్వడం లేదు. నిర్మాణ వ్యయం భారీగా పెరగడం, కాలనీల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. దీనికితోడు ఎన్నికల ముందు వరకు అధికారులు నిర్మాణాల్ని పూర్తి చేయాలని ఒత్తిడి తేవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సరిపోక పోవడంతో తమపై భారం పడుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో సిమెంట్ బస్తా రూ.400, ఇనుము టన్ను రూ.75 వేల వరకు ఉందని వాపోతున్నారు. కొంతమంది లబ్ధిదారులకు మొన్నటి వరకు నిర్మాణాలు ప్రారంభిద్దామని ముందుకొచ్చినా, పునాదుల వరకు వేసి వదిలిపెట్టిన వారు ఎక్కువమంది ఉన్నారు. సుమారుగా మూడు వేల మందికి పైగా లబ్ధిదారులు పునాదులు వేసి విడిచి పెట్టారు. దాదాపు రెండు వేల ఇళ్ల గోడల వరకు కట్టి వదిలేశారు. పునాది, గోడలు కట్టేటప్పటికి రూ.5 లక్షలు వరకు ఖర్చు కావడం, మిగిలిన పని చేసేందుకు మరో ఐదారు లక్షలు వ్యం అవుతుండటంతో ఆర్థిక స్థోమత లేక మధ్యలో ఆపేశారు. సుమారుగా 9 వేల వరకు లబ్ధిదారులు కనీసం పునాదులు కూడా తీయలేదు. ఈ కాలనీలో కాలువలు లేవు. నిర్మాణానికి నీటి సరఫరా లేదు.

ఖాళీగా ఉన్న లేఅవుట్

నిర్మాణ సామగ్రి కొనుగోలు చేసి లేఅవుట్‌లోకి తీసుకెళ్లేందుకు ఖర్చు భారంగా ఉండటంతో లబ్ధిదారులు ముందుకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. నూతనంగా వచ్చిన టిడిపి ప్రభుత్వమైనా నిర్మాణాలు పూర్తి చేస్తుందో? లేదో వేచి చూడాల్సిందే.

అర్థాంతరంగా వదిలేసిన ఇళ్ల నిర్మాణాలు

రామోజీ మృతికి సంతాపం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి యావత్ పత్రికా రంగానికి తీరని లోటని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలుగు దినపత్రికను తెలుగు వారి లోగిళ్లకు చేర్చిన ఘనత రామోజీరావుకే దక్కిందని తెలిపారు. పత్రికా రంగంలో ఆయన చేయని ప్రయోగాలు లేవని, పాత్రికేయ రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కష్టపడి పనిచేస్తే ఎంతటి ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని, రామోజీ జీవితాన్ని చూసి నేర్చుకోవచ్చని తెలిపారు.

విజయనగరంకోట : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతికి ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామోజీరావు మరణవార్త విని చాలా కలత చెందానని చెప్పారు. సమాజం పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తూ, జర్నలిజంలో విలువలు అందరికీ నేర్పారని కొనియాడారు. ఒకప్పుడు ఈనాడు సంస్థ ఉద్యోగిగా ఉన్న తాను, ప్రస్తుతం విజయనగరం ఎమ్‌పి స్థాయికి ఎదగడం రామోజీరావు ఇచ్చిన స్ఫూర్తేనని పేర్కొన్నారు.

రామోజీరావు లేని లోటు తీరనిది

రామోజీరావు మృతి పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ అదపాక సత్యారావు తీవ్ర విచారం వ్యక్తంచేశారు. రామోజీరావు మరణం దేశంలోని మీడియా రంగానికి, ప్రత్యేకంగా ఈనాడు గ్రూప్ సంస్థలకు తీరని లోటని పేర్కొన్నారు.

ప్రశాంతంగా బిఇడి ప్రవేశ పరీక్ష

90 శాతం మంది అభ్యర్థులు హాజరు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బిఇడి ప్రవేశాలకు నిర్వహించే ఎడ్‌సెట్-2024 ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. 90 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస మోహన్ తెలిపారు. ఎంవిజిఆర్ కళాశాలలో 120 మందికి 103 మంది అభ్యర్థులు, సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 131 మంది, ఐయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో 500 మందికి 454 మంది అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు.

పరీక్షకు హాజరైన విద్యార్థులు

13న కామాక్షమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 13న బొండాడవీధిలోని కామాక్షమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పాలక మండలి అధ్యక్షులు ఎ.సోమరాజు తెలిపారు. శనివారం ఆ ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే కార్యక్రమాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

15న పతంజలి పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కెఎన్‌వై పతంజలి 72వ జయంతి సందర్భంగా ఈ నెల 15న ప్రముఖ రచయిత రౌతు బంగారునాయుడుకు పతంజలి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షులు బీశెట్టి బాబ్జీ తెలిపారు. శనివారం గురజాడ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని రీడింగ్ హాల్లో అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. సమావేశంలో వేదిక కార్యదర్శి ఎన్.కె.బాబు, ప్రతినిధులు వి.ఎం.కె.లక్ష్మణరావు, జలంత్రి రామచంద్ర రాజు, గురజాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఓటమి టిడిపికి గుణపాఠం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వైసిపి ఓటమి టిడిపికి గుణపాఠం వంటిది. ఔను..! దీన్ని గుణపాఠంగా తీసుకోకపోతే రానున్న ఐదేళ్ల తరువాత పరిస్థితి ఇలాగే కొనసాగుతుందని చెప్పలేం. తాజా రాజకీయ పరిణామాలే ఇందుకు తార్కాణం. ఈ మాటలు అంటున్నది రాజనీతి శాస్త్రజ్ఞులు, కాకలుతీరిన రాజకీయ నాయకులు మాత్రమే కాదు సుమా..! సాధారణ ప్రజానీకం కూడా చర్చించుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరువాత జిల్లాలో హాట్‌హాట్‌గా సాగుతున్న పబ్లిక్ టాక్ ఇది. ఇందుకు కారణం లేకపోలేదు. వైసిపికి రాష్ట్రంలో 11 అసెంబ్లీ స్థానాలు, నాలుగు పార్లమెంట్ స్థానాలైనా వచ్చాయి. మన జిల్లాలో ఏంటబ్బా అందులో ఒక్కటి కూడా లేదు. ఇంత ఓటమికి జగన్, ఆయన అనుసరించిన విధానాలే కారణమా? ఇందులో ఎమ్మెల్యేల పాత్ర ఎంత? అనే దానిపై సర్వత్రా చర్చ వినిపిస్తోంది. వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలను ఎంతగానో సంతృప్తి పరిచాయి. కానీ, బిజెపి ప్రవేశపెట్టిన చెత్తపన్ను, విలువ ఆధారిత ఆస్తిపన్ను, ఇంటిపన్ను, విద్యుత్తు సంస్కరణల అమలుకు అత్యుత్సాహం చూపడంతో అవి పేద, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారాలుగా మారాయి. దీనికితోడు మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల ప్రవర్తన, భాష జనాన్ని విసిగించాయి. ఇవన్నీ రాష్ట్ర స్థాయిలో జరిగిన లోపాలు. ఈ సంగతి అటుంచితే జిల్లాలోని ఎమ్మెల్యేల తీరు నష్టాలను మరింతగా పెంచింది. మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణను మినహాయిస్తే దాదాపు ఎమ్మెల్యేలంతా గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రయివేటు భూములు కబ్జాలు చేశారని, ఇసుక, కంకర, అటవీ సంపద వంటి సహజ వనరులను సొమ్ము చేసుకున్నారనేది ప్రజలు కోడైకూస్తున్నారు. మరికొందరైతే సంపాదన అనే యావలో పడి ఓట్లేసిన ప్రజలను పట్టించుకోలేదు. చివరికి పార్టీ కార్యకర్తలను సైతం పక్కనబెట్టారు. గడిచిన ఐదేళ్లలో ఉద్యోగ, ఉపాధి మార్గాలను ప్రభుత్వం ఎలాగూ చూపలేకపోయింది. కనీసం ఉన్న ఉద్యోగాలు ఊడిపోకుండా చేయలేకపోయారు.జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడినా నోరు మెదపకపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఉద్యోగులకు బదిలీ సిఫార్సులు, అధికారులకు పోస్టింగులు కావాలంటే రూ.లక్షలు



ముట్టజెప్పాల్సిన దుస్థితి కూడా కనిపించింది. ఫైలు స్పీడుగా నడవాలంటే మరో రేటు. ఇక క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే గౌరవ వేతనంతో బతుకీడుస్తున్న ఆశా, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్, మధ్యాహ్న భోజన కార్యకర్తలపై కూడా రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులకు పాల్పడ్డారు. వీరిలో ఎంతో మందిని బాధ్యతల నుంచి తొలగించి, తమ అనుయాయులను పెట్టుకున్నారు. నిరసన తెలిపితే నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు. వీటి వెనుక కూడా ఎమ్మెల్యే జోక్యం ఉందన్నది జనం మాట. ఇటువంటి చర్యలు కేవలం బాధిత కుటుంబాల్లోనే కాకుండా పేద, మధ్య తరగతి ప్రజలను ఒకింత ఇబ్బందులకు, మనస్తాపానికి గురిచేశాయి. దాదాపు అందరు ఎమ్మెల్యేలూ అధినేత జగన్మోహన్‌రెడ్డి బాధ భరించలేక ఇంటింటికీ వైసిపి ప్రభుత్వం అన్న పేరుతో జనాల వద్దకు వెళ్లినప్పటికీ, స్థానిక సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి వంటివాటికి చొరవ చూపలేదు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాగూ కల్పించలేదు. కనీసం ప్రకటించిన ధర ప్రకారమైనా క్రయవిక్రయాలు జరిగేలా ఎమ్మెల్యేలెవరూ ప్రయత్నం చేయలేదు. మరో మాటలో చెప్పాలంటే ధాన్యం కొనుగోళ్లలో జరిగిన దోపిడీలో సాక్షాత్తూ ఎమ్మెల్యేల హస్తం ఉందన్న ఆరోపణలు కూడా రైతుల నుంచి వినిపించాయి.

జిల్లా ప్రజలకు సాగునీరో తాగునీరో కల్పించేందుకు కనీసం చొరవ తీసుకోలేదు. సాగునీటి కోసం మంత్రి బొత్స కొంత చొరవ చూపినప్పటికీ ప్రభుత్వం సహకరించలేదు. మొత్తం ఇవన్నీ కప్పిపుచ్చేందుకు జిల్లాలోని పార్టీ పెద్దలు లేనిపోని ప్రచారం పదేపదే చేస్తుండేవారు. ఎంతసేపు ఎమ్మెల్యేలతో సంబంధం లేకుండా వచ్చిన నగదు బదిలీ పథకాల ఏకరువే పెట్టారు. దీంతో, ఎమ్మెల్యేలను జనాలు విశ్వసించలేదు. దాదాపు అన్ని చోట్లా ఇదే అంచనాకు వచ్చిన జనం వైసిపి తరపున పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థులకు వ్యతిరేకంగా ఓట్లు వేశారు. అందుకే టిడిపి గెలిచింది. ప్రజలంతా మార్పును కోరుకున్నారు. ఈ సత్యాన్ని టిడిపి తరపున గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్‌పిలు ప్రతి క్షణం గుర్తుంచుకోకపోతే వచ్చే ఎన్నికల్లో ఇదే ఆదరణ చూపుతారని చెప్పలేం. తాజాగా ఎన్నికైన వారిలో ఎక్కువ మంది కొత్తవారే ఉన్నారు. వీరైనా ప్రజలకు అందుబాటులో, అండగా ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అందుకే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైసిపి ఎమ్మెల్యే, ఎమ్‌పిల ఓటమిని గుణపాఠంగా తీసుకోవాలని జనం చర్చించుకుంటున్నారు.

11మంది పై కేసు నమోదు

- రీసుపేట కొట్లాటలో పోలీస్ చర్యలు
- మూడు గ్రామాల్లో కొనసాగుతున్న పికెట్

ప్రజాశక్తి - భోగాపురం

రీసుపేటలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

మండలంలోని తూడెం పంచాయితీ రీసుపేటలో జరిగిన కొట్లాట కేసులో ఇరువర్గాలకు చెందిన 11మంది వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సిఐ ఎ. రవికుమార్ తెలిపారు. ఈ గ్రామంలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య శుక్రవారం రాత్రి కొట్లాట జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఇరు వర్గాల వారు పరస్పరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ గ్రామంలో వివాదం జరగడంతో పోలీసులు పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఎటువంటి వివాదాలు జరగకుండా ఉండేందుకు ఈ పికెట్ ఏర్పాటు చేసినట్లు సిఐ తెలిపారు. ఇప్పటికే గుడివాడ, రాజపులోవ గ్రామాల్లో ఎన్నికల కౌంటింగ్ రోజు నుంచి పికెట్ కొనసాగుతుంది. ఎన్నికల కౌంటింగ్ రోజు సాయంత్రం వైసిపి, జనసేన కార్యకర్తల మధ్య స్వల్ప వివాదాలు చెలరేగాయి. ఇప్పుడు రీసుపేటలో కూడా పికెట్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ముగిసినందున ఎటువంటి వివాదాలకు వెళ్ల రాదని అన్నారు. కేసుల్లో ఇరుక్కుపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.

బానాదిలో అన్నదానం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

11న పరదేశమ్మ అనుపోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ పంచాయతీ పరిధిలోని బక్కునాయుడుపేట గ్రామ దేవత శ్రీ పరదేశమ్మ తల్లి అమ్మవారి అనుపోత్సవం ఈ నెల 11న నిర్వహించనున్నారు. ఈ నెల 2 నుంచి గ్రామ దేవత పండగ జరుగుతుండగా అనుపోత్సవం మంగళవారం నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పందేలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు

టిడిపి నాయకునికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలిపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోకాడ జగన్నాథం చిన్నాన్న అబ్బినాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యవర్గ సభ్యుడు కోళ్ల బుచ్చి రాంప్రసాద్, మండల టిడిపి ఉపాధ్యక్షుడు పి రమణ, ప్రధాన కార్యదర్శి కొట్టాడ రమణమూర్తి, టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో సేదతీరుతున్న క్రీడాకారులు

క్రీడాకారులకు ఆటవిడుపు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ, మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల రోజులుగా నిర్వహించిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ముగిసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రీడాకారులకు ఆటవిడుపుగా శనివారం పట్టణంలోని సిరికి రిసార్ట్స్‌లో గల స్విమ్మింగ్ పూల్‌కి తీసుకెళ్లి ఆహ్లాదకరమైన వాతావరణంలో స్విమ్మింగ్‌ను చీఫ్ కోచ్ డాక్టర్ శ్రీరాములు, కోచ్‌లు మహమ్మద్ అస్లాం, బి.హారిక, పి మౌనికలు చేయించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆశాజనకంగా పెరిగిన నువ్వు పంట

ఆశాజనకంగా నువ్వు పంట

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పలు గ్రామాలలో తొలకరి నువ్వు పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. వర్షాలు సకాలంలో అనుకూలించడంతో పంట వేపుగా పెరిగి దిగుబడి వచ్చేలా కనిపిస్తోంది. ఈ నువ్వు పంట ఫలితం రైతుల చేతికి వస్తే ఖరీఫ్ వరి పెట్టుబడులకు ఉపయోగపడుతుందని పలువురు రైతులు ఆశాబావం వ్యక్తం చేస్తున్నారు.

ఏడు పంచాయతీల్లోనే వైసిపికి స్వల్ప మెజారిటీ

- 15 పంచాయతీల్లో టిడిపికే ఆదరణ
- మండలంలో 5,322 ఓట్ల మెజారిటీ

ప్రజాశక్తి- రామభద్రపురం

మండలంల టిడిపికి కంచుకోట అనేది మరోసారి రుజువైంది. ఈ ఎన్నికల్లో 22 పంచాయతీల నుంచి 5,322 ఓట్లు మెజారిటీతో టిడిపి ఆధిక్యత చూపింది. మేజర్ పంచాయతీ రామభద్రపుర లో 9 పోలింగ్ బూతుల్లో 1838 ఓట్లు మెజారిటీతో ఉనికిని చాటుకుంది. వైసిపికి కేవలం 7 పంచాయతీల్లో మాత్రమే స్వల్ప మెజారిటీ లభించింది. అప్పలరాజుపేటలో12, జన్నివలసలో 17, పాలవలసలో67, రావివలసలో133, పాడివానివలసలో51, పాతరేగలో 24, దుప్పలపూడిలో 38 ఓట్లు టిడిపి కంటే వైసిపికి ఎక్కువ వచ్చాయి. అయితే కొట్టక్కి, ఆరికతోట, రొంపల్లి, మిర్తివలస, నాయుడువలస గ్రామాల్లో వైసిపికి గట్టి పట్టు ఉందని ఇక్కడ అత్యధిక మెజారిటీ వస్తుందని ఆ పార్టీ నాయకులు అంచనాలు వేసినప్పటికీ తారుమారయ్యింది. ముఖ్యంగా కొట్టక్కిలో వైసిపి మహిళా నేత సామంతుల నిర్మల, మండల పార్టీ అధ్యక్షులు అప్పికొండ లక్ష్యుంనాయుడు, జెడ్‌పిటిసి సరస్వతి అన్ని తామై పార్టీ కోసం శ్రమించినా వారి స్వగ్రామం నుంచి కూడా మెజారిటీ సాధించలేక పోవడం గమనార్హం. ఇక ఆరికతోట, కొండకెంగువ గ్రామాల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షులుగా పెంకి అరుణ, బెల్లాన ప్రసాదు పదవుల్లో ఉన్నప్పటికీ వారి స్వగ్రామాల్లో కూడా మెజారిటీ సాధించలేక పోయారు. మండల కేంద్రంలో ఎంపిపి లక్ష్మణరావు, జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు కిర్ల శేఖర్‌తో పాటు అధికశాతం కేడర్ శ్రమించినా మెజారిటీ సాధనలో వెనుక పడ్డారు. ప్రస్తుత తాజా మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి చినప్పలనాయుడు ఈ ఐదేళ్లలో మండలానికి చెప్పుకో తగిన అభివృద్ధి చేసిన దాఖలాలు లేకపోవడం, ప్రభుత్వం నుంచి ప్రజలందరికీ సమాన సంక్షేమం అందక పోవడం, ఇస్తున్న ప్రయోజనాలు కన్నా చెల్లించే రుసుములు, విద్యుత్, మద్యం, నిత్యావసరాలు ధరలు అధికమవ్వడం, నాణ్యత లేని 'జే 'బ్రాండ్ల మద్యంతో అనారోగ్యాలు రావడం వంటి వాటితో ప్రజలు విసుగు చెంది ఓటు అనే ఆయుధంతో వైసిపిని చిత్తుగా ఓడించారు. ముఖ్యంగా జగన్ పాలన తుగ్లక్ పాలన కన్నా దారుణంగా ఉందని బాహాటంగానే చర్చించుకున్నారు. అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టిస్తూ ప్రశ్నించే పౌరులపై కేసులు పెట్టడం, సొంత గూండాలతో దాడులు చేయించడం వంటి ఘటనలతో ప్రజలు వైసిపిని దూరం పెట్టినట్లు గ్రామాల్లో చర్చజరుగుతోంది. అధికారంలో లేకపోయినా ఎన్నో సేవలు చేస్తూ ప్రజామోదం పొందిన బేబీనాయనకు మండల ప్రజలు బ్రహ్మరథం పట్టి అత్యధిక మెజారిటీ ఇచ్చి ఆదరించారు. గత ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి వైసిపికి సుమారు 8వేలు మెజారిటీ రాగా ఈ దఫా సుమారు 44 వేలు మెజారిటీ బేబీ నాయనకు రావడం విశేషం. అధికారం లేనప్పుడు కూడా ప్రజా సేవలో ఉండే 'నాయన'కు టిడిపి ప్రభుత్వం మంత్రి వర్గంలో చోటు కల్పించి బొబ్బిలి నియోజక వర్గ అభివృద్ధికి అధిక ప్రాదాన్యత కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఓటేసేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు(ఫైల్)

పదవులు కాదు.. పార్టీనే ముఖ్యం

- టిడిపికి విధేయుడిగా తెంటు రాజా
- బేబినాయన విజయంలో కీలకపాత్ర
- లోకేష్ హామీపై ఆశలు!

ప్రజాశక్తి- బొబ్బిలి, బాడంగి

టిడిపికి విధేయుడిగా ఉంటూ బొబ్బిలి నియోజకవర్గంలో బేబినాయన గెలుపునకు పనిచేసి నిస్వార్థ నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు(రాజా). వైసిపిలో చేరితే ఎమ్మెల్యేగా గెలిపిస్తామని 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ తాను టిడిపిలోనే కొనసాగుతానని నిర్మొహమాటంగా చెప్పి, అదేవిధంగా కొనసాగుతూ మంచి వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకున్నారు. తనకు పదవుల కన్నా టిడిపి ముఖ్యమంటూ పార్టీకి విధేయుడిగా ఉంటూ పని చేశారు. అందుకే టిడిపి అధికారంలోకి వస్తే రాజాకు ఎమ్మెల్సీ ఇచ్చి చట్టసభలోకి తీసుకు వెళ్తామని ఎన్నికల ముందు బాడంగి మండలంలో జరిగిన బిసి గర్జన సభలో ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు.

బేబినాయనతో కలిసి ప్రచారం చేస్తున్న తెంటు రాజా (ఫైల్)

తండ్రి మరణంతో రాజకీయ రంగప్రవేశం

తెంటు రాజా తండ్రి తెంటు జయప్రకాశ్ మరణం తర్వాత రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తెర్లాం నియోజకవర్గం నుంచి ఆరు సార్లు టిడిపి నుంచి పోటి చేసిన జయప్రకాశ్.. ఐదు సార్లు విజయం సాధించి ఎమ్మెల్యేగా పని చేశారు. 2008 జనవరి 6న ఎమ్మెల్యేగా పని చేస్తూ తెంటు జయప్రకాశ్ అనారోగ్యంతో మరణించారు. తండ్రి మరణంతో రాజకీయ రంగప్రవేశం చేసిన తెంటు రాజా.. అదే ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించి ఎమ్మెల్యేగా పని చేశారు. 2009 ఎన్నికల్లో తెర్లాం నియోజకవర్గం బొబ్బిలి నియోజకవర్గంలో విలీనం కావడంతో 2009, 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2017లో బొబ్బిలి రాజులు టిడిపిలో చేరడంతో 2019 ఎన్నికల్లో టిడిపి టికెట్ సుజయకృష్ణ రంగారావుకు, 2024 ఎన్నికల్లో బేబినాయనకు కేటాయించారు. రెండు సార్లు ఆయనకు టిక్కెట్టు ఇవ్వకపోయినా టిడిపికి విధేయుడిగా ఉంటూ గెలుపునకు పనిచేశారు. రెండు సార్లు టికెట్ ఇవ్వకపోయినా పార్టీలో ఉంటూ టిడిపి బలోపేతానికి పని చేయడంతో తెంటు రాజాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని నారా లోకేష్.. బాడంగి బిసి గర్జన సభలో ప్రకటించారు. టిడిపి అధికారంలోకి రావడంతో తెంటు రాజాకు ఎమ్మెల్సీ ఇచ్చి మాట నిలబెట్టుకోవాలని టిడిపి కార్యకర్తలు కోరుతున్నారు.

2019లో వైసిపిలో చేరితే..

2019 ఎన్నికలకు ముందు తెంటు రాజాను వైసిపిలో చేరాలని అప్పటి వైసిపి నేత బొత్స సత్యనారాయణ కోరినట్లు తెలిసింది. వైసిపిలో చేరితే 2019 ఎన్నికల్లో గెలిపించి ఎమ్మెల్యేను చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ వైసిపిలో చేరేందుకు తెంటు రాజా అంగీకరించలేదని బోగట్టా. అప్పట్లో వైసిపిలో చేరితే ఎమ్మెల్యేగా విజయం సాధించే వారని చర్చ ఉంది. 2024 ఎన్నికల్లో కూడా బొబ్బిలి నియోజకవర్గం నుంచి కొత్త అభ్యర్థిని పోటీలో పెట్టేందుకు తెంటు రాజాను వైసిపిలో చేరాలని కోరినప్పటికీ ఆసక్తి చూపలేదని చర్చ ఉంది. టిడిపిని స్థాపించినప్పటి నుంచి తండ్రి తెంటు జయప్రకాశ్ ఆ పార్టీలోనే ఉండడంతో తాను కూడా ఎటువంటి పదవులతో సంబంధం లేకుండా టిడిపిలో ఉంటానని చెప్పి కొనసాగుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థి బేబినాయన గెలుపునకు శాయశక్తులా పని చేశారు. రాజా సహాయం మరువలేనిదని బేబినాయన కూడా ప్రకటించారు. టిడిపి అధిష్టానం తెంటు రాజా సేవలకు గుర్తింపుగా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని నియోజకవర్గ కార్యకర్తలు కోరుతున్నారు.

హైలెవెల్ బ్రిడ్జి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుంటాం - తుమ్మ గుడ్డి రహదారిలో నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. మెట్టగుడ్డి మీదుగా రూ. 5.75 కోట్లుతో రహదారి నిర్మాణం జరుగుతోంది. పనుల నాణ్యత, వివిధ అంశాల్లో జరగాల్సిన పనుల వివరాలను పరిశీలించారు. కొద్ది రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉంటాయని, పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలకు రహదారి అందుబాటులోకి రావడం వల్ల ఇతర ప్రాంతాలతో అన్ని విధాలా అనుసంధానం జరుగుతుందని చెప్పారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎంవిఆర్ కృష్ణాజీ పనుల వివరాలు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడం వల్ల అరకుతో సహా దాదాపు 20 గ్రామాలకు అనుసంధానం లభిస్తుందని వివరించారు. ఇదిలా ఉండగా సంవత్సర కాలంలో 52 రహదారులకు అటవీ అనుమతులు జారీ చేసి, మారు మూల ప్రాంతాలలో రహదారి సౌకర్యం కల్పించుటకు జిల్లా కలెక్టర్ చొరవ చూపారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల గ్రామస్తులు అరకుకు కేవలం 30 కిలో మీటర్ల దూరంలో ఉంటారని ఆయన తెలిపారు.

చర్యలకు ఎందుకు వెనుకడుగు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

గుర్రపు కోనేరు ఆక్రమణపై చర్యలకు పోలీసులు, దేవాదాయ శాఖ అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించారు. ఆక్రమణకు గురైన గుర్రపు కోనేరును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన గుర్రపు కోనేరు మధ్యలో ఉన్న ఆలయ మండపంలో పురాతన విగ్రహాలు చోరీ చేసి కోనేరు ఆక్రమణ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా దేవాదాయ శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పురాతన విగ్రహాలు చోరీపై హిందూ ఉత్సవ సమితి సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకుండా కేసు రాజీ చేసేందుకు ప్రయత్నించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. విగ్రహాలు చోరీపై చర్యలు తీసుకోకుండా కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. గుర్రపు కోనేరు వద్ద పర్మినెంట్ నిర్మాణం చేపట్టినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, పురాతన విగ్రహాలు చోరీపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

సాగు నీటికి మొదటి ప్రాధాన్యత

బొబ్బిలిరూరల్ : రైతులకు సాగు నీరు అందించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. శనివారం రొంపల్లి వద్ద ఉన్న పారాది చానల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నీటి పారుదల శాఖ డిఇ తిరుపతి రావుని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. గత పాలకులు ఐదు సంవత్సరాలుగా సాగునీటి పై నిర్లక్ష్యం వహించారని ప్రస్తుతం చానల్‌లో కుడి కాలువకు 2 కిలో మీటర్లు, ఎడమ కాలువకు 2 కోలో మీటర్లు చెప్పున పూడికలు తియ్యాల్సి ఉందని వాటిని తన సొంత నిధులతో చేయిస్తానని తెలిపారు. పనులకు రూ.32 కోట్లు వరకు ప్రతిపాదనలు తయారు చేశామని డిఇ తెలిపారు. అనంతరం భోజ్యరాజపురం పంపుహౌస్‌ను పరిశీలించి పట్టణ ప్రజలు తాగు నీటి సమస్యలు పరిష్కారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పట్టణ తాగు నీటి శాశ్వత పరిష్కారానికి రూ.96 కోట్లుకు ప్రతిపాదనలు పంపామని కమిషనర్ తెలిపారు.

ప్రజల కోసం పనిచేస్తా

బాడంగి: రెట్టింపు ఉత్సాహంతో నియోజకవర్గ ప్రజల కోసం పని చేస్తానని బొబ్బిలి ఎమ్మెల్య బేబినాయన అన్నారు. శనివారం మండలంలోని కోడూరు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు నివాశానికి వచ్చిన ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల నివాళులర్పించారు. అనంతరం పిన్నవలస గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామంలో ఎన్ఆర్ఐ కొల్లి రామినాయుడు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఈ గెలుపును వృధా చేయకుండా ప్రజలకు న్యాయం చేస్తానన్నారు. కొల్లి రామినాయుడు టిడిపి గెలుపులో భాగస్వామ్యం అయ్యారని బేబినాయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి భాస్కరరావు, తెంటు కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి రైతు నవధాన్యాలను ఉపయోగించడం వల్ల భూసారం పెరుగుతుందని డిపిఎం ఆనందరావు అన్నారు. శనివారం కొండతామరపల్లి ఆర్‌బికెలో రైతులకు నవధాన్యాలు గురించి వివరించి తయారు చేసే విధానాన్ని చూపించారు. వరి పంటకు ముందు ఒక ఎకరానికి 10 కేజీలను నవధాన్యాలు వేయడం వల్ల కార్బన్ పెరిగి భూసారం పెరుగుతుందన్నారు. దీని వల్ల రసాయనక ఎరువులు అధికంగా ఉపయోగించాల్సినవసరం లేదన్నారు. వరి పంటతో పాటు అపార పంటలు అధిక దిగుబడి వస్తుందన్నారు. చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి, పచ్చిరొట్ట విత్తనాలు అన్నీ కలిపి వేయడం వల్ల వచ్చే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎమ్‌టి ఈశ్వరమ్మ, గాయత్రి, సీతారత్నం, జ్యోతి రైతులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: నవధాన్యాలు వేయటం వల్ల మట్టిలో భూసారం పెరుగుతుందని ఎఒ రవీంద్ర తెలిపారు. శనివారం మండలంలోని సంతగైరంపేట, వినాయకుపల్లి గ్రామాలలో రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూసారాన్ని పెంచుకోవచ్చున్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా వచ్చిన జనుములు, జిలుగులు, పిల్లి పెసరతో పాటు రైతుల వద్ద ఉన్న మినుములు, పెసలు ఉలవలు, కందులు, ఆకుకూర విత్తనాలు కూరగాయ విత్తనాలు కలిపి వరి సాగుకు ముందు ఎకరాకు 10 నుంచి 12 కేజీలు వేసినట్లయితే భూములో ఉన్న పోషకాలు పెరగడమే కాకుండా పంటకు అవసరమయ్యే పోషకాలు సిద్ధం చేసుకున్నందుకు వీలుగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విఎఎ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎంటి కోటిబాబు, మల్లేష్ నాయుడు, చరణ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎఒ రవీంద్ర

రోడ్డు సౌకర్యం మెరుగుపర్చాలి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి, ఆతవ గ్రామాలకు వెళ్లే రహదారిని మెరుగుపర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సింగరాయి నుంచి ఆతవ గ్రామానికి కిలోమీటర్ లోపు ఉన్న కోమటి చెరువు గట్టును ఉపాధి హామీ పథకం ద్వారా గట్టు వెడల్పు చేశారు. వెడల్పు చేసిన గట్టుపై మెటల్ వేసి కంకర వేస్తే ఇరు గ్రామాల ప్రయాణానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, రైతులు పండించే పంటను కల్లాలకు తెచ్చుకునే అవకాశం సులువుగా ఉంటుంది. ఈ గట్టును అభివృద్ధి చేయకపోవడం వల్ల వర్షాకాలం సింగరాయ ఆతవ వెళ్లాలంటే జగ్గయ్యపేట రోడ్డుకు వెళ్లి ఆకుల సీతంపేట మీదుగా ఆతవ గ్రామానికి చేరుకోవాల్సి వస్తుంది. దీంతో సుమారు 6 కిలోమీటర్ల ప్రయాణం చేయాలి. గతంలో ఈ కోమటి చెరువు గట్టును వెడల్పు చేయడానికి విశాఖపట్నం ఎంపి పురందేశ్వరి రూ. 30 లక్షలు కేటాయించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో తరువాత వచ్చిన స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపి గాని ఈ విషయం పట్టించుకోలేదు. ఏమాత్రం వర్షం వచ్చినా ఈ రెండు గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని ఇప్పటికైనా గట్టును అభివృద్ధి చేసి రహదారి సౌకర్యం కల్పించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈ గట్టునే అభివృద్ధి చేయాల్సి ఉంది..

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రైల్వే కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ అరకు బ్రాంచ్ ఇన్చార్జి ఎన్.ఎస్.ఎల్. కోటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ కేంద్ర కమిటీ తనను అరకు బ్రాంచ్ ఇన్చార్జిగా నియమించారని అందులో భాగంగానే యూనియన్లతో సంప్రదించి వారి సమస్యలను తెలుసుకుంటున్నానని చెప్పారు. కార్మికుల సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. పనిచేసే చోట ఎవరికి ఏ ఇబ్బంది ఉన్నా తనకు తెలియజేయాలని సూచించారు. ఎటువంటి పోరాటాలు లేకుండానే సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు

ప్రజాశక్తి - గజపతినగరం

ప్రజాస్వామ్యంలో దాడులకు తావు లేదని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో గజపతినగరం, దత్తిరాజేరు మండల కార్యకర్తలు, నాయకులతో ఎన్నికల ఫలితాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అందరి అభిప్రా యాలను ఓపిగ్గా విన్న తర్వాత కర్ణుడు చావుకి కారణాలు ఎన్నో అన్నట్లు పార్టీ ఓటమికి కారణాలు ఉన్నాయని వాటిని జగన్మోహన్ రెడ్డి దృష్టిలో పెడతామని అన్నారు. ఫలితాల పట్ల ఎవరూ నిరుత్సాహపడవలసిన అవసరం లేదని పార్టీకి 40 శాతం ఓటు బ్యాంకుతో పటిష్టంగా పదిలంగా ఉందని చెప్పారు. పార్టీ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటా నని తెలియజేశారు. కూటమి ఎమ్మెల్యే గెలిచిన కొండపల్లి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఐదు సంవత్స రాల పరిపాలనలో తనతో పాటు ప్రయాణం చేసిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తమ పాలనలో ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి అందివ్వాలని ఉద్దేశంతో టెండర్లకు పిలిచామని, ఏరియా ఆసుపత్రినే వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దడంలో 80 శాతం పనులు పూర్తి చేశామని, రోడ్లను కూడా 80 శాతం పూర్తి చేసామని మిగిలిన పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిచేయాలని కోరారు. కూటమి ప్రకటించిన మేనిఫెస్టోకు ఆకర్షితులై ప్రజలు అధికారం ఇచ్చారని ఇప్పుడు వాటిని కచ్చితంగా నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు శాంతి యుతంగా పాలనందిం చామని కూటమి అధికారంలోకి రాగానే వైసిపి నాయ కులు కార్యకర్తలపై దాడులు చేయడం సరికాదని అన్నారు. ఈ సమావేశంలో వైసిపి యువ నాయకులు బొత్స సాయిగురు నాయుడు, జెడ్‌పిటిసి గార తవుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

రామోజీరావుకు ఎమ్మెల్యే శ్రద్ధాంజలి

ప్రజాశక్తి- గంట్యాడ

శనివారం తెల్లవారు జామున మృతి చెందిన రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి పట్ల గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ శ్రద్ధాంజలి ఘటించారు. మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, టిడిపి నాయకులు కొండపల్లి భాస్కర నాయుడు, జి.శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

బొబ్బిలి: ఈనాడు అధినేత పద్మవిభూషణ్ రామోజీ ఆకస్మిక మరణం పత్రిక రంగానికి తీరని లోటని, దానిని ఎవరూ పూడ్చలేరని కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు రోటరీ క్లబ్ ప్రతినిధి జెసి రాజు అన్నారు. శనివారం ఆయన రామోజీ మృతికి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

నెల్లిమర్ల: రామోజీరావు మృతి బాధాకరమని టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, విజయనగరం పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు సువ్వాడ వనజాక్షి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ అన్నారు. శనివారం వారు రామోజీరావు మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు.

చీపురుపల్లి: రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చీపురుపల్లి టిడిపి ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్షర యోధుడిగా పేరుగాంచిన, క్రమశిక్షణ, పట్టుదల, దీక్షతో ముందుకుసాగి దశాబ్దాల కాలంగా మీడియా రంగంలో మహారాజుగా నిలిచిన రామోజీరావు మృతి చాలా బాధాకరమన్నారు.


గంట్యాడ: రామోజీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

డెంకాడ: మండల కేంద్రంలో రామోజీరావు చిత్రపటానికి టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కరరావు, కర్రోతు సత్యనారాయణ, కలిదిండి పాణీరాజు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జామి: మండల కేంద్రంలో మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, టిడిపి నాయకులు వర్రి రమణ, కొత్తలి రాధాకృష్ణ తదితరులు శనివారం రామోజీరావు మృతి పట్ల సంతాపం తెలిపారు.